క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 6న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వినాయకనగర్, కేఎల్ఎన్ రెడ్డికాలనీ, సర్క్యూట్ హౌస్‌రోడ్డు, కోర్టు, వరంగల్ కలెక్టరేట్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు, నాగేంద్రనగర్, లోటస్ కాలనీ, జులైవాడ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. మామునూర్, కుమ్మరిపల్లి, డైరీఫాం ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేట బస్టాండ్ కూడలి వద్ద ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, ఎమ్మార్పీఎస్, కుల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నిత్యావసరాల అందజేత



దేశాయిపేట: దేశాయిపేట జగ్జీవన్‌రాం కూడలిలో ఇద్దరు పేద చిన్నారుల కుటుంబానికి 50కిలోల బియ్యం, దుస్తులను జాతీయ మానవ హక్కుల సంఘం న్యాయ సేవ ఆధ్వర్యంలో ఇంతేజార్‌గంజ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా ఉండడం అభినందనీయమన్నారు. సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ యాకూబ్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలెపాక మధు, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోలెపాక రాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ అభిలాష్ సుధాకర్, కమలాకర్, చిన్నయ్య, శోభ, పద్మ, కవిత పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలికల అప్పగింత

ఖిలా వరంగల్: బాలికల అదృశ్యం కేసును మిల్స్‌కాలనీ పోలీసులు 24గంటల్లో ఛేదించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలికలను సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గుర్తించి వారి తల్లికి శుక్రవారం అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం వరంగల్ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన కాంపెల్లి వినోద్, దివ్య దంపతుల కుమార్తెలు బుధవారం మధ్యాహ్నం కిరాణం షాపుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బాలికల తల్లి దివ్య బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య స్పందించి ప్రత్యేక టీమ్‌ను రంగంలోకి దింపారు. ఐటీ కోర్ సల్మాన్ సాయంతో మిల్స్‌కాలనీ ఐడీ పార్టీ 24గంటల్లో ఆ ఇద్దరు బాలికలను గుర్తించి అప్పగించారు.

అసంపూర్తి పనులతో ఇబ్బందులు



కాజీపేట: కాజీపేట చౌరస్తా నుంచి వాటర్ ట్యాంక్ వరకు చేపట్టిన రహదారి పనులను అర్ధంతరంగా వదిలేయడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దర్గా సొసైటీ డైరెక్టర్ కాయిత రాజ్‌కుమార్ యాదవ్ తెలిపారు. సోమిడి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రహదారులను విస్తరించకుండా డివైడర్ నిర్మాణాలు చేపట్టడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్, మేకల శ్రావణ్‌కుమార్ యాదవ్, భగవాన్‌దాస్ ఉపాధ్యాయ, సిరికొండ రామేశ్వరాచారి, సుంచు ప్రశాంత్, తోట శివ, కుమార్ యాదవ్, అనిల్, పరశురాములు పాల్గొన్నారు.

శాకంబరి ఉత్సవాల ఆహ్వానం



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో శనివారం నుంచి ప్రారంభమయ్యే శాకంబరి ఉత్సవాలకు హాజరు కావాలని జిల్లా అధికారులను ఆహ్వానించారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా, వరంగల్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావుకు దేవాలయ ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు, సిబ్బంది ఆహ్వాన పత్రికలను అందజేశారు.

విద్యార్థులకు దాతల చేయూత

రామన్నపేట: నగరంలోని రామన్నపేటలోని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టెవాడ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో విద్య అనేది తప్పనిసరిగా మారిందని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను కష్టపడి చదివించి ఉన్నత శిఖరాలకు చేర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీషర్టుల పంపిణీ

కాజీపేట రూరల్: పేద విద్యార్థులకు టీషర్టులు పంపిణీ చేయడం అభినందనీయమని హనుమకొండ ఇన్‌చార్జ్ డీఈఓ డి.చలపతిరావు ప్రశంసించారు. కాజీపేట దర్గా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు బి.సతీష్‌పాల్ తన సతీమణి జ్యోతికళ నాల్గవ వర్ధంతి సందర్భంగా 6, 7, 8వ తరగతుల విద్యార్థులకు టీషర్టులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు దాతలు చేయూతనివ్వాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ ఎన్ఎంఎం.స్వామి, సెక్టోరియల్ ఆఫీసర్ రాధ, ఉపాధ్యాయుడు సతీష్‌పాల్ కుటుంబ సభ్యులు షోబాబు, శిల్ప, సువర్ణరుత్, రేషల్‌రుత్, స్టాఫ్ సెక్రటరీ కటుకూరి శ్రీనివాస్, సుమలత, సునీత, ఎన్.రాజు, సరోజ, వేణుగోపాల్‌రెడ్డి, రాంగోపాల్, శంషొద్దీన్, వరలక్ష్మి, పూర్వ విద్యార్థి రాజ్‌మోహన్ పాల్గొన్నారు.



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న రాజేంద్రప్రసాద్



విద్యార్థులతో ఇన్‌చార్జ్ డీఈఓ, ఉపాధ్యాయులు

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



రోడ్డుపై బైఠాయించిన నాయకులు, విద్యార్థులు

రామన్నపేట: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.7 వేల కోట్లకుపైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ డిమాండ్ చేశారు. ఈమేరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎంజీఎం ఆస్పత్రి కూడలిలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ ఫీజులు కట్టాలంటూ పేద, మధ్య తరగతి విద్యార్థులను కళాశాలల యజమాన్యాలు ఇబ్బంది గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలాగే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థి వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ధర్నాలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులను పోలీసులు నిలువరించే ప్రయత్నం చేసి అరెస్టు చేశారు. కార్యక్రమంలో వరంగల్ విభాగ్ కన్వీనర్ నిఖిల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరుణ్, జోనల్ ఇన్‌చార్జ్‌లు శ్రవణ్ కుమార్, హరిచరణ్, కార్యకర్తలు సర్దార్, శ్రవణ్, రోహిత్, రేవంత్, శ్రీకాంత్, అక్షిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాల్సిందే..



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష నాయకులు

హన్మకొండ అర్బన్: బొగ్గు గనుల వేలాన్ని తక్షణమే రద్దు చేసి, సింగరేణికి అప్పగించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. ఆర్ట్స్ కాలేజీ నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి ఎన్.హంసారెడ్డి, ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి గొడగాని శివాజీ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి జి.దయాకర్ పాల్గొన్నారు.

శ్రావణపల్లి ఓసీని వేలం వేయొద్దు

కాశీబుగ్గ సెంటర్: సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి ఉపరితల బొగ్గు గని వేలాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు వరంగల్ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాబు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు రాచర్ల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

కేయూ క్యాంపస్: నిరుద్యోగులకు న్యాయం చేయాలని, గ్రూప్ పోస్టులను పెంచాలని టీజీపీఎస్సీ ముట్టడికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తుగా అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని జిల్లా అధ్యక్షుడు స్టాలిన్ అన్నారు. కేయూలో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాపితంగా అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జస్వంత్, పరిమల రాజు, సాయిప్రదీప్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్.. విడుదల

ఖిలా వరంగల్: టీజీపీఎస్ నిరుద్యోగుల సమస్యలపై టీజీపీఎస్సీ ముట్టడి నేపథ్యంలో పలువురు బీజేపీ నాయకులను ముందస్తుగా వరంగల్ మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తులపై విడుదల చేశారు. అరెస్టులను ప్రతిఒక్కరూ ఖండించాలని నాయకులు అన్నారు. అరెస్టయిన వారిలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు, పుప్పాల శ్రీనివాస్, చింతల అనిల్, భూపాల్, గొర్రె కోటి, జిలకర వీరస్వామి, తాళ్లపల్లి రమేష్‌గౌడ్, వేల్పుల నందు, రాజు ఉన్నారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

హసన్‌పర్తి: బీజేవైఎం రాష్ట్ర సంఘం తలపెట్టిన ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు శుక్రవారం అడ్డుకున్నారు. హసన్‌పర్తి మండలంలోని బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో ఉన్న కార్యకర్తలను స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచంద్రారెడ్డి పరామర్శించారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా వికలాంగుల పెన్షన్ల పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ పోలెపాక శంకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపుమేరకు జిల్లా కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం డీఆర్ఓ గణేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు వికలాంగులకు చేయూత పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినప్పటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఓహెచ్ రోస్టర్ పాయింట్లను 56 శాతం నుంచి 10 శాతానికి తగ్గించాలని, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని, 2016 వికలాంగుల చట్టం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూడల శ్రీనివాస్, జిల్లా నాయకులు రాజు, యాకుబ్ పాషా, చింతపట్ల వెంకటేశ్వర రావు, తిరుపతమ్మ, ఎమ్మార్పీఎస్ నాయకులు వస్కుల వినయ్, మంద విశాల్, వస్కుల శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగ్రహానికి గురైనా మారని కేసీఆర్ తీరు

హన్మకొండ: సుమారు పదేళ్లుగా దురహంకార, అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాత, రజాకార్ల వంటి కుటుంబ పాలన సాగించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి అప్పుల ఊబిలోకి నెట్టి గత శాసనసభ ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురై పదవి కోల్పోయిన మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు తీరుమాత్రం మారలేదని ప్రముఖ సామాజిక, ఆర్థికవేత్త, తెలంగాణ ఉద్యమకారుడు కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. హనుమకొండలో తెలంగాణ ఉద్యమకారుల కమిటీ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని దోచుకొని రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన కల్వకుంట్ల కుటుంబానికి ప్రజాస్వామ్యంలో ఇక స్థానం లేదని హితువు పలికారు.



మాట్లాడుతున్న వెంకటనారాయణ

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

హసన్‌పర్తి: ప్రజాసేవే తన ధ్యేయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీల వీడ్కోలు సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించినట్లు వివరించారు. స్పెషల్ ఆఫీసర్ మేన శ్రీను, ఎంపీడీఓ ప్రవీణ్, మాజీ ఎంపీపీ సునీత, మాజీ వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ సునీత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, ఏపీఓ విజయలక్ష్మి, ఎంపీఓ రవిబాబు పాల్గొన్నారు.



ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వరంగల్: గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని మణికంఠ కాలనీలో నెలకొన్న సమస్యలు తీర్చాలని మణికంఠ కాలనీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, వరంగల్ ఎంపీ కడియం కావ్యను కలిసి వినతి పత్రం అందజేశారు.

సబార్డినేటర్లకు పదోన్నతులు కల్పించాలి



విద్యాలతకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హన్మకొండ: ఆఫీస్ సబార్డినేటర్లకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ పంచాయతీరాజ్ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి చాగంటి రవి కోరారు. హనుమకొండలోని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వైవీ.గణేష్, జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈఓ ఎం.విద్యాలత, డిప్యూటీ సీఈఓ రవిని సంఘం నాయకులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగి ఉండి ఆఫీస్ సబార్డినేట్లుగా 30 ఏళ్లుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ ముశం రామకృష్ణ, కోశాధికారి మాడుగుల రాజమౌళి, ఉపాధ్యక్షుడు ఎండీ.అంకుషావలి, సంయుక్త కార్యదర్శి మైదం కిరణ్ కుమార్, సభ్యులు ఎస్‌డీ.నజీర్, సదానందం పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి

హన్మకొండ అర్బన్: నగరంలోని బాలసముద్రంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రంలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సెక్రటేరియట్‌లో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్దర్ తన ఆఖరి శ్వాస వరకు తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు ఇస్తామని గతంలో కాంగ్రెస్ ప్రకటించి గద్దర్ విగ్రహ ఏర్పాటుకు ఇప్పుడు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆగస్టు 6న గద్దర్ వర్ధంతి సందర్భంగా గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి అధికారికంగా ఆవిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్ కాడపాక రాజేందర్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, డీఎంఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్, స్కాలర్ దూడపాక సురేష్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జేఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పర్మనెంట్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై జాయింట్ యాక్షన్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ కృష్ణారెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు, ఆప్రాన్లు, బ్లౌజులు, మాస్కులు అందజేయాలని పేర్కొన్నారు. వాహనాలకు సకాలంలో మరమ్మతులు జరిగేలా చూడాలని కోరారు. ఔట్ సోర్సింగ్ జేఏసీ నాయకులు అధ్యక్షుడు పుల్లా రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను ప్రకాష్, నాయకులు పాశం రవియాదవ్, ఓరుగంటి జీవన్ కుమార్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

ఖిలా వరంగల్: రిషినందు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంగశాయిపేటలోని బిర్లా ఓపెన్‌మైండ్ హైస్కూల్‌లో పారిశుద్ధ్య మహిళా కార్మికులకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. స్కూల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావుతో కలిసి ట్రస్ట్ చైర్మన్ కొల్లూరి యోగానంద్ చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు, స్వరూప, రచన తుషిత్, నందన్, పూర్వీ, చిన్మయి, జోశ్వికనంద, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ బాధ్యులు

సంక్షిప్తంగా

ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలి

విద్యారణ్యపురి: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని డీఈఓ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం 25శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ రోహిత్, సుమన్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కాశీబుగ్గ సెంటర్: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎర్రగొల్ల భరత్‌వీర్ డిమాండ్ చేశారు. తెలంగాణ యువ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్‌ను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ప్రశాంత్, రాజేశ్, వినయ్, అరుణ్ సాయి, నోముల రతన్ పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

హన్మకొండ అర్బన్: మహిళలపై జరుగుతున్న పాశవిక దాడులను అరికట్టాలని రాణి రుద్రమదేవి సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ప్రతినిధులు కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో డీఆర్ఓ గణేష్‌కు ప్రతినిధులు శుక్రవారం మెమోరాండం అందజేశారు. అనంతరం పోకల జ్యోతిర్మయి మాట్లాడుతూ దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు, 12వ డివిజన్ కార్పొరేటర్ స్రవంతి, అనితా ఠాకూర్, అన్నపూర్ణ, అపర్ణ, పోకల సునీత, ఝాన్సీ, మంజుల, సుజాత పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

న్యూశాయంపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. ఈనెల 10న జాతీయ కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించనున్న ధర్నాల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్‌లో ఉప్పలయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, చక్రపాణి, అశోక్, రవి, సంపత్, యాకయ్య, వెంకన్న, రామన్న, రాజేష్, జమున, రమాదేవి, శోభారాణి పాల్గొన్నారు.

మంత్రివర్గంలో లంబాడీలకు స్థానమేది?

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో మంత్రివర్గంలో లంబాడీలకు స్థానమేదని తెలంగాణ విద్యార్థి జేఏసీ గిరిజన విద్యార్థి కోఆర్డినేటర్ డాక్టర్ దేవోజీనాయక్ ప్రశ్నించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే బలరాం నాయక్‌కు పీసీసీ అధ్యక్ష పదవి, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రనాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో ఎకనామిక్స్ విభాగంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ సూర్యనారాయణ, వెంకట్‌నాయక్, రాజునాయక్, రాజకుమార్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఆర్డీని కలిసిన బల్దియా ఉద్యోగులు

వరంగల్ అర్బన్: వరంగల్ మున్సిపల్ రీజినల్ డైరెక్టర్, అప్పిలేట్ కమిషనర్ షాహిద్ మసూద్‌ను హనుమకొండలో కార్యాలయంలో బల్దియా మినిస్టీరియల్ ఉద్యోగులు, జేఏసీ నాయకులు శుక్రవారం కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఆర్డీని జేఏసీ అధ్యక్షుడు గౌరీశంకర్, సూపరింటెండెంట్ బాకం సంతోష్ కుమార్, జారతి అనిల్‌కుమార్, ఆనంద్, బండారి రవి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు అయిత సుఖదా, రజిత, సందీప్, రాజేష్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం ఎన్నిక

కాజీపేట: కాజీపేట డివిజన్ ఫొటోవీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా తూర్పాటి జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా మంతెన మోహన్, కోశాధికారిగా పిల్లి అనిల్ కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా బొమ్మల అశోక్, ప్రభాకర్, కాగిత రాజు, దేగల శ్రీధర్, అందె రవికుమార్, దండిగం సమ్మయ్య పాల్గొన్నారు.

పాలక మండలి సభ్యులకు సన్మానం

కేయూ క్యాంపస్: కేయూ పాలకమండలి సభ్యులుగా నియమితులైన యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిర్ర రాజును సన్మానించారు. క్యాంపస్‌లోని రిజిస్ట్రార్ చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు అభినందించారు.

టీఎన్జీవోస్ నాయకులకు..

హన్మకొండ అర్బన్: టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, ఎండీ.ముజీబ్‌ను హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవోస్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో జిల్లా సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు సత్యనారాయణ గౌడ్, శ్యాంసుందర్, మొయిజ్, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు రాజమౌళి, రాజేష్ ఖన్నా, గోపీకృష్ణ, గౌతం, శ్రీనివాస్, శ్యామ్, కుమార్ పాల్గొన్నారు.

కేయూ పాలక మండలి సభ్యుడికి..

హన్మకొండ: కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు చిర్ర రాజును బీసీ సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. హనుమకొండ నయీంనగర్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాజుకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

మడికొండ: మృతుల కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నేత జంగా రాఘవరెడ్డి శుక్రవారం పరామర్శించారు. మడికొండ గ్రామానికి చెందిన నార్లగిరి నర్సయ్య, మద్దెల నర్సమ్మ మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఓదార్చారు. పరామర్శించిన వారిలో తొట్ల రాజుయాదవ్, కుర్ల మోహన్, పైడిపాల రఘుచందర్, బిల్ల రవీందర్, గుర్రం అమర్‌నాథ్, నీలం వేణుయాదవ్, వస్కుల శంకర్, భాస్కర్, దువ్వ విజయ్, సందీప్, జగదీశ్వర్ రెడ్డి, వస్కుల శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కేంద్రం కాలయాపన

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందని ఎమ్మార్పీఎస్ టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా అన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ - టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఈనెల 7న హైదరాబాద్‌లో దీక్ష చేయనున్నారని తెలిపారు. ఈమేరకు దీక్ష వాల్‌పోస్టర్లను హనుమకొండ వడ్డెపల్లిలో ఆవిష్కరించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి విజయ్‌కుమార్, జిల్లా నాయకులు ఇల్లందుల భాస్కర్, గిన్నారపు అనిల్ కుమార్, జన్ను సంజీవ్, రూపాస్, దుప్పటి కోటి, కిరణ్, ప్రదీప్, పవన్, శ్యామ్, ధనుష్, శంకర్, భాను పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

వరంగల్: మాదిగ హక్కుల సాధన కోసం ఈనెల 7వ తేదీన చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వరంగల్ ఇన్‌చార్జ్ నమిండ్ల క్లైమెంట్ పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరగనున్న ఉద్యమ రజతోత్సవ సభకు మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చికిత్సకు వచ్చి కాలు జారి మృతి

హసన్‌పర్తి: వృద్ధుడు చికిత్స కోసం వచ్చి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్‌కు చెందిన ఉప్పలయ్య(75) కొంత కాలంగా టీబీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 1న హనుమకొండలోని టీబీ ఆస్పత్రికి వచ్చి కాలుజారి కిందపడ్డాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈమేరకు మృతుడి కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిమెంట్ ఇటుకలు తీసుకెళ్లేందుకు యత్నం

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న సిమెంట్ ఇటుకలను కాంట్రాక్టర్ అనుమతితో ఆటోలో ఇంటికి తీసుకెళ్లేందుకు శుక్రవారం సాయంత్రం హెచ్ఎం యత్నించారు. స్థానికులు గమనించి హెచ్ఎంను నిలదీశారు. ఈ సంఘటనపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపించి హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

రాతికోట ముఖద్వారం ధ్వంసం

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ కోటలోని రాతికోట పశ్చిమ ద్వారాన్ని జేసీబీ వాహనం శుక్రవారం ఢీకొట్టింది. దాంతో రాతి స్తంభం ఆర్చ్ ధ్వంసమైంది. డ్రైవర్ నిర్లక్ష్యం, కేంద్ర పురావస్తుశాఖ అధికారుల నిఘా లోపం వల్ల రాతి కోట ముఖద్వారం స్తంభం విరిగిపడింది.

రెడ్డి బాలికల హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

హన్మకొండ అర్బన్: రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెడ్డి బాలికల హాస్టల్‌లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి, మెరుగు హనుమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఆపై చదువుకునే రెడ్డి కులానికి చెందిన విద్యార్థినులు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96766 49811 నంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.